క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

పలమనేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు, రాజనీతి శాస్త్రం సబ్జెక్టులకు గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జనవరి 4లోపు కళాశాల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ డా.వెంకటేశులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పీజీతోపాటు, స్లెట్/నెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి తొలి ప్రాధాన్యత ఉంటుందని అందులో పేర్కొన్నారు.

నేడు లయన్స్ క్లబ్ చిల్డ్రన్స్ ఫెస్టివల్


శివ

పుంగనూరు: నూతన సంవత్సరం పురస్కరించుకుని చిల్డ్రన్స్ ఫెస్టివల్‌ను ఆదివారం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ శివ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతిఏటా నిర్వహించే విధంగా ఈ కార్యక్రమం చేస్తున్నామన్నారు. పట్టణ సమీపంలోని కృష్ణమరెడ్డిపల్లె రోడ్డులోని అక్షర స్కూల్‌లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు ఫెస్టివల్ నిర్వహిస్తామన్నారు. 15 రకాల ఈవెంట్స్ నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. పట్టణంలోని విద్యార్థులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించుకునేందుకు ఫెస్టివల్‌ను వేదిక చేసుకోవాలని ఆయన కోరారు.

30న ఎస్సీ, ఎస్టీ కమిటీ సమావేశం

పుంగనూరు: మండల తహసీల్దార్ కార్యాలయంలో ఈనెల 30న ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రాము తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కులస్తుల సమస్యల పరిష్కారంపై సమావేశంలో చర్చించేందుకు అన్ని శాఖల అధికారులు, సభ్యులు తప్పక హాజరుకావాలని కోరారు.

మదర్‌థెరిసాలో ముగిసిన శిక్షణ


బజాజ్ కంపెనీ ప్రతినిధులతో కళాశాల యాజమాన్యం


గంగవరం: మండలంలోని మదర్‌థెరిసా ఎంబీఏ కళాశాలలో బజాజ్ ఫిన్సర్వ్ ఆధ్వర్యంలో గత 16 రోజులుగా జరిగిన శిక్షణ కార్యక్రమాలు శనివారంతో ముగిసినట్లు కళాశాల చైర్మన్ రవీంద్రబాబు తెలిపారు. శిక్షణలో బజాజ్ కంపెనీలో అనుభవజ్ఞులైన నిపుణులతో విద్యార్థులకు ఆర్థికపరమైన అంశాలు ఫైనాన్స్, బ్యాంకింగ్ రంగంలో వస్తున్న వివిధ సాంకేతిక మార్పులను వివరించారన్నారు. అలాగే ఫైనాన్స్, బ్యాంకింగ్ అంశాలలో చేయాల్సిన సర్టిఫికెట్ కోర్సులు గురించి వివరించి కమ్యూనికేషన్ సాఫ్ట్ స్కిల్స్‌ను పెంపొందించే దిశగా శిక్షణ ఇచ్చామన్నారు. దీని వలన ఎంబీఏ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆయన పేర్కొన్నారు. శిక్షణ ఇచ్చే అధ్యాపకులతో పాటు ప్రాజెక్ట్ మేనేజర్, కళాశాల చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైభవం.. అఖండ హరినామ స్మరణం


భజన చేస్తున్న భక్త బృందం

వి.కోట: పట్టణంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం వైభవంగా హరి నామస్మరణ భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంతో ఆలయ ప్రాంగణం స్వామివారి నామ స్మరణతో మారుమోగింది. ప్రతి శనివారం ప్రత్యేక భజన బృందంతో నిర్వహించే ఈ కార్యక్రమం ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

నగర వనానికి మొక్కలు సిద్ధం


నడుమూరు వద్ద పెంచుతున్న మొక్కలు

కుప్పంరూరల్: కుప్పం మండలం, నడుమూరు వద్ద నిర్మాణంలో ఉన్న నగర వనం పార్కు సుందరీకరణలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు కుప్పం ఫారెస్ట్ రేంజర్ జయశంకర్ తెలిపారు. జనవరిలో పార్కు పూర్తి స్థాయిలో ప్రారంభిస్తున్న సందర్భంగా వనంలో ఆయుర్వేద, మోదుగ, అత్తి, జమ్మి, బాదం, మామిడి మొక్కలను పెంచే కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. పార్కు అందాన్ని పెంచేందుకు వివిధ రకాలైన పూల మొక్కలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. నడుమూరు వద్ద నగరవనం పక్కనే ఈ మొక్కలను పెంచుతున్నట్లు చెప్పారు. త్వరలో రైతులకు మొక్కలు పెంచి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ప్రజల సొమ్ముతో సోకులు

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో ప్రభుత్వ కార్యాలయాల్లో అలంకారాలకు, ఆర్భాటాలకు ప్రాధాన్యతనిస్తున్నారు. అభివృద్ధిని పక్కనపెట్టి ఉద్యోగులు విధులు నిర్వహించే కార్యాలయాల్లో అలంకరించుకుంటూ రూ.లక్షల ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం అలంకార మొక్కలకు లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.. -కుప్పం



కడ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన షో చెట్లు, కడ కార్యాలయంలో అలంకారాల కోసం ఏర్పాటు చేసిన చెట్టు

- ప్రభుత్వ కార్యాలయాలకు లక్షల్లో వ్యయం
- రూ.లక్షల ప్రజాధనం వృథా
- మండిపడుతున్న ప్రజలు

కుప్పం మండల పరిషత్ కార్యాలయానికి రూ.20 లక్షల వ్యయంతో నూతన హంగులతో ఆర్భాటాలు చేస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వయా (వర్చువల్ ఇంటరాక్టివ్ ఏరియా) గది నిర్మాణానికి రూ.10 లక్షలను వెచ్చించారు. మండల పరిషత్ కార్యాలయంలో అన్ని సచివాలయాల పాలనా పరమైన అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు వర్చువల్ ఇంటరాక్టివ్ ఏరియా గదిని ఏర్పాటు చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న టెక్నాలజీ ఆధారంగా ఆయా సచివాలయ అధికారులతో ప్రతినెలా సమావేశాలు నిర్వహించి అభివృద్ధి కార్యక్రమాలపై చర్చలు జరిపేవారు. ఈ వర్చువల్ ఇంటరాక్టివ్ కార్యాలయం వల్ల ఒరిగిందేమీ లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం ప్రజా ధనం వృథా చేయడంతో పాటు ఆర్భాటాలు సృష్టిస్తున్నారంటూ ఆరోపణలు వస్తున్నాయి. దీంతో పాటు మండల సచివాలయ సమావేశ గది, మండల పరిషత్ అధికారి ప్రత్యేక చాంబర్, అదనపు సౌకర్యాలు కోసం మరో రూ.10 లక్షలు ఖర్చు చేశారు. ప్రస్తుతం ఉన్న ఆర్థిక సంక్షోభంలో ఆర్భాటాలకు, అలంకారాలకు మూడు నెలల వ్యవధిలో రూ.20 లక్షలు వృథా ఖర్చు అని అధికార పార్టీ నాయకులే మండిపడుతున్నారు.


మండల కార్యాలయంలో వర్చువల్ ఇంటరాక్టివ్ ఏరియా గది

షో మొక్కల కోసం లక్షలా..?

కుప్పం మున్సిపాలిటీ పరిధిలో షో మొక్కలు ఏర్పాటు చేసేందుకు లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నారు. ప్రధానంగా కడ కార్యాలయం ప్రాంగణంలో షో మొక్కలు నాటడంతో పాటు కార్యాలయం లోపల అలంకారంగా కనిపించేందుకు షో మొక్కలను అక్కడక్కడ ఏర్పాటు చేశారు. వీటిలో కడ కార్యాలయం మధ్య భాగాన ఏర్పాటు చేసిన ఒక్క మొక్క రూ.70వేలతో ఏర్పాటు చేసినట్లు తెలిసింది. తిరుపతికి చెందిన ఓ కాంట్రాక్టర్ ద్వారా ఈ మొక్కలను మున్సిపాలిటీ అధికారులు కొనుగోలు చేసి ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం కుప్పం మున్సిపాలిటీలో అర్ధాంతరంగా ఆగిన డబుల్‌రోడ్డు పనులు పునఃప్రారంభమైతే ఇప్పుడు ఏర్పాటు చేసిన షో మొక్కలన్నింటినీ తొలగించాల్సిందే. దీని కోసం లక్షల్లో వెచ్చించడం పట్ల పట్టణ వాసులు విమర్శలు గుప్పిస్తున్నారు.

ఘనంగా శనిత్రయోదశి పూజలు



పుంగనూరు: పట్టణ సమీపంలోని యాబైరాళ్ల మొరవ, రాగానిపల్లె రోడ్డులో వెలసియున్న శనేశ్వర స్వామి ఆలయాల్లో శని త్రయోదశి పూజలు నిర్వహించారు. శనివారం వేకువజాము నుంచి ఆలయ అర్చకులు శనేశ్వరస్వామికి తైలాభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించి, స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారికి నువ్వులనూనె దీపాలు వెలిగించి, మొక్కులు చెల్లించుకున్నారు.

రామకుప్పం: శని త్రయోదశి సందర్భంగా శనివారం రామకుప్పం సమీపంలోని శనేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, విశిష్ట పూజలు చేశారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయంలో భక్తులతో రద్దీ కిటకిటలాడింది. అదేవిధంగా సుబ్రమణ్యస్వామి, పద్మావతీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

మున్సిపల్ బడ్జెట్ రూ.34.31 కోట్లు

- చైర్మన్ అలీమ్‌బాషా


మాట్లాడుతున్న చైర్మన్ అలీమ్‌బాషా, చిత్రంలో కమిషనర్ మధుసూదన్‌రెడ్డి

పుంగనూరు: మున్సిపాలిటీలో 2025–2026 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను సవరించి రూ.34.31 కోట్లుగా అంచనా వేసి ప్రవేశపెట్టినట్లు చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. శనివారం సమావేశాన్ని కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా కౌన్సిల్‌లో బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు. చైర్మన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఆదేశాల మేరకు బడ్జెట్‌ను రూపొందించామన్నారు. ప్రజలపై భారం వేయకుండా బడ్జెట్‌ను సవరించి తయారు చేశామని తెలిపారు. గత సంవత్సరం సవరించిన బడ్జెట్ అంచనాలతో నూతన బడ్జెట్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. రానున్న సంవత్సరంలో మున్సిపాలిటీలోని 31వ వార్డులోని విస్తరణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు. అలాగే పట్టణంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు మెరుగుపరిచే చర్యలను తీసుకోనున్నట్లు తెలిపారు. సమావేశంలో పలువురు సభ్యులు తమ సమస్యలను చైర్మన్‌కు తెలియజేసి బడ్జెట్‌పై సలహాలు అందజేశారు. వైస్ చైర్మన్‌లు నాగేంద్ర, లలిత, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసికారోగ్యం

రామకుప్పం: నేటి ఆధునిక జీవన విధానంలో ధ్యానంతో మానసికారోగ్యం పెంపొందించుకోవచ్చని ఎస్ఎస్‌వై సభ్యులు మునిరెడ్డి, ప్రమీల, సుమిత్రమ్మ అన్నారు. రామకుప్పం సమీపంలోని సుబ్రమణ్యస్వామి ఆలయ ఆవరణలో శనివారం ఎస్ఎస్‌వై ఆధ్వర్యంలో మౌనవ్రత సాధన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మౌనవ్రత సాధన ద్వారా మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. శిబిరంలో సూర్య నమస్కారం, ధ్యానం, అష్టయోగం, ఆసనాలను నేర్పించారు.

అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ బాలాజి

పెద్దపంజాణి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ బాలాజి శనివారం అంగన్‌వాడీ టీచర్లు, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మండలంలోని అంగన్‌వాడీ పిల్లలందరికీ జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డులు మంజూరు చేసేందుకు అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులు కలసి కృషిచేయాలని ఎంపీడీఓ పేర్కొన్నారు. ఈమేరకు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప, పంచాయతీ విస్తరణ అధికారి శారదాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శారద, లత, గీతమ్మ పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరానికి స్పందన


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పుంగనూరు: పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో ఆసంఘం శనివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. సంఘ అధ్యక్షుడు చెంగారెడ్డి ఆధ్వర్యంలో చెన్నైకి చెందిన శంకర్ నేత్రాలయ వైద్యులతో శిబిరం నిర్వహించారు. 42 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించి, కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. శిబిరంలో రిటైర్డ్ ఉద్యోగులు మునస్వామి మొదలియార్, రామకృష్ణారెడ్డి, సుబ్రమణ్యం, శ్రీనివాస్, ఆనందశెట్టి, బలరాంశెట్టి, సుబ్బరామయ్య, దిలీప్‌కుమార్, గోవిందు, చంద్రశేఖర్, దొరస్వామి పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి


అవగాహన కల్పిస్తున్న డీసీపీఓ

రొంపిచెర్ల: బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని డీసీపీఓ బాలసుబ్రమణ్యం అన్నారు. అయన శనివారం రొంపిచెర్ల కేజీబీవీలో బాలికలకు కిశోరి వికాశంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు, ఐసీడీఎస్ అధికారులకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. చెడు అలవాట్లకు బాలికలు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ సుజాత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరానే లక్ష్యం


వసనాడు సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్ఈ

కుప్పంరూరల్: నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరానే లక్ష్యమని ఎస్ఈ ఇస్మాయిల్ పేర్కొన్నారు. శనివారం కుప్పం మండల పరిధిలో నూతనంగా నిర్మించనున్న సబ్‌స్టేషన్ల కోసం స్థల పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కుప్పంలో నూతనంగా కనమనపల్లి, గంగాపురం, పైపాల్యం, వాలూరు, లింగాపురం, ఎర్రచేన్లు గ్రామాల్లో ఆరు కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం చేట్టనున్నట్లు తెలిపారు. ఇందుకోసం అనువైన స్థలాలు పరిశీలిస్తున్నట్లు చెప్పారు. కుప్పంలో అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు తమ వైపు నుంచి అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం వసనాడు సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాసమూర్తి, ఏఈ రామిరెడ్డి, ఎల్ఐ జయచంద్ర, పాల్గొన్నారు.

ఇదేం పన్నుల వాత!

- ఏపీ ఎన్జీఓ అధ్యక్షుడు ఆనంద్‌బాబు

పలమనేరు: దేశంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు ప్రజలపై విధించే పన్నులకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని పలమనేరు ఏపీ ఎన్జీఓ అధ్యక్షుడు ఆనంద్‌బాబు శనివారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. వేతన జీవుల నుంచి ఆదాయపు పన్నును 5శాతం నుంచి 30 శాతానికి పెంచారని తెలిపారు. మిగిలిన సొమ్ముపై జీఎస్టీ 5శాతం నుంచి 28 శాతం దాకా వసూలు చేసి దండుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా ప్రజల నుంచి భారీగా వసూలు చేసిన పన్నుల ద్వారా ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యాన్ని కూడా ప్రభుత్వాలు అందివ్వడం లేదని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నా ఉద్యోగులకు ఆరు నెలలకోసారి ఇవ్వాల్సిన కరువు భత్యం కూడా ఇవ్వడం లేదని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజా వ్యతిరేకత రాక మునుపే కళ్లు తెరవాల్సిన అవసరం ఉందన్నారు.

విద్యార్థుల్లో మేధస్సును గుర్తించాలి




పలమనేరు: విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంఈఓలు, సైన్స్‌ఫేర్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓలు, రొంపిచెర్ల: విద్యార్థులు చేసిన ప్రయోగాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

పలమనేరు: ఏపీ విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో 8, 9,10 తరగతుల విద్యార్థులకు మండల స్థాయి సైన్స్‌ఫేర్ కార్యక్రమం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం జరిగింది. కార్యక్రమాన్ని ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం ప్రారంభించారు. మండలంలోని ఎనిమిది పాఠశాలల నుంచి వ్యక్తిగత, గ్రూప్, టీచర్ అనే మూడు విభాగాల్లో ఉత్తమ ప్రాజెక్టును మండల స్థాయికి ఎంపిక చేశారు. మండల స్థాయి కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా జూనియర్ కళాశాల అధ్యాపకులు కృష్ణారావు, హేమప్రియ వ్యవహరించారు. గ్రూపు ప్రాజెక్టులో మొదటి స్థానం ఉదయ్‌కిరణ్, దొడ్డిపల్లి హైస్కూల్, రెండో స్థానం పూజిత, గురుకుల పాఠశాల, మూడో స్థానం పవన్, కొలమాసనపల్లి దక్కించుకున్నారు. వ్యక్తిగతంలో ఆశ్రీ, చరణ్‌తేజ్, గౌతంరెడ్డి, టీచర్స్ క్యాటగిరిలో నాగేంద్ర (దొడ్డిపల్లి), మహ్మదుల్లా(ఉర్దూ స్కూల్) విజేతలుగా నిలిచారు. వీరికి నోడల్ హెచ్‌ఎం విజయకుమార్ బహుమతులు, సర్టిఫికెట్లను అందించారు. విజేతలు ఈనెల 31న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. హెచ్‌ఎంలు, సైన్స్ టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ

పుంగనూరు: పాఠశాల విద్యార్థుల సైన్స్‌ఫేర్ కార్యక్రమంలో విద్యార్థులు తమ ప్రతిభను కనబరచి బహుమతులు అందుకున్నారు. శనివారం మండల సైన్స్‌ఫేర్ పోటీలను మున్సిపల్ హైస్కూల్‌లో ఎంఈఓలు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెన్నశెట్టి ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ 85 రకాల మోడల్స్‌ను ప్రదర్శించారు. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు విద్యార్థులను ఎంపిక చేశారు. ఎంఈఓ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు సైన్స్‌ఫేర్‌లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఉపాధ్యాయులు శారద, శ్రీదేవి, ప్రమీల, గంగాధర్, ఉపాధ్యాయ సంఘ నేతలు కిషోర్‌కుమార్‌రెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు

మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలకు చెందిన కె.తేజశ్రీ తయారు చేసిన ఫుడ్ మేనేజ్‌మెంట్ వేస్ట్ ప్రయోగానికి మొదటి బహుమతి లభించింది. అలాగే ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థి గౌరిశిధర్ రూపొందించిన డయాలసిస్ ప్రాజెక్టుకు రెండవ బహుమతి లభించింది. భాష్యం స్కూల్‌కు చెందిన విద్యార్థి భగీరథ ఏర్పాటు చేసిన ఈజీ సాల్వింగ్ ప్రాజెక్టులను జిల్లా పోటీలకు ఎంపిక చేశారు. గెలుపొందిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

సదుం జెడ్పీ ఉన్నత పాఠశాలలో

సదుం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి సైన్స్‌ఫేర్ నిర్వహించినట్లు హెచ్‌ఎం జయకుమార్‌రెడ్డి తెలిపారు. ఇందులో సైన్స్ ప్రాధాన్యతను ఎంఈఓలు సిద్ధరామయ్య, దామోదర విద్యార్థులకు అవగాహన కల్పించారు. అభిరామ్‌నాయక్(ఎంజేపీ పాఠశాల), రెడ్డిశేఖర్, అరవింద్ (పాలమంద) జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యారని హెచ్‌ఎం చెప్పారు. వారికి బహుమతులు అందజేశారు.

రొంపిచెర్ల: విద్యార్థుల్లో దాగి ఉన్న మేధస్సును ఉపాధ్యాయులు గుర్తించాలని ఎంఈఓ ఇందిర అన్నారు. శనివారం రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సైన్సు ప్రయోగాలు చేయడం వలన వారిలో దాగి ఉన్న మేధస్సు బయటపెడుతుందన్నారు. అనంతరం సైన్స్ ప్రయోగాల్లో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రదానం చేశారు. గానుగచింత, పెద్దమల్లెల, కేజీబీవీ, అదర్శ పాఠశాల, రొంపిచెర్ల బాలికలు, ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఎంఈఓ శ్రీనివాసులు, బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మోహన్‌రెడ్డి, సీఆర్‌పీలు అనసూయ, కిరణ్, రాజేంద్ర పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ

గుడుపల్లె: జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు వైజ్ఞానిక ప్రదర్శనలో గెలుపొందిన జట్లకు శనివారం ఎంఈఓ లక్ష్మయ్య బహుమతులను అందించారు. మండలంలోని 13 జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 60 మంది విద్యార్థులకు గుడుపల్లె మోడల్ స్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. 10 మంది విద్యార్థులు ఒక జట్టుగా ఏర్పడి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రయోగాలు నిర్వహించారు. ఇందులో ప్రథమ బహుమతి గుత్తర్లపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలోని జయశ్రీ జట్టు ప్రథమ బహుమతి గెలుపొందగా, శెట్టిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలోని సంధ్యా టీం ద్వితీయ బహుమతిని సాధించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించి అభినందించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ భువనేశ్వరి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో అధికారులు


సదుం: బహుమతులు ఇస్తున్న ఏంఈఓలు


గెలుపొందిన విద్యార్థులతో ఎంఈఓ లక్ష్మయ్య

పోలీస్ స్టేషన్ తనిఖీ


సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ సాయినాథ్

రొంపిచెర్ల: రోడ్డు భద్రతపై ప్రయాణికులకు అవగాహన కల్పించాలని చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ అన్నారు. ఆయన శనివారం రొంపిచెర్ల పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవగాహన లేక రోడ్డు ప్రమాదాలు ఎక్కువ అవుతున్నాయని అన్నారు. పోలీసులు దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు రోడ్డు ప్రమాదాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘా ఉంచాలన్నారు. గ్రామాల్లో కోడి పందేలు, జూదం నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్ఐ సుబ్బారెడ్డి, ఏఎస్ఐ మధు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి


నిరసనలో పంచాయతీరాజ్ ఉద్యోగులు

పెద్దపంజాణి: అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీఓ జవహర్‌బాబుపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని పంచాయతీరాజ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. శనివారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఎంపీడీఓ బాలాజి, ఈఓపీఆర్డీ శారదాదేవి, ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.